క్లుప్తంగా

కొనకంచివారిపాలెంలో 'ఫ్యామిలీ డాక్టర్'



రొంపిచర్ల: మండలంలో కొనకంచివారిపాలెం గ్రామంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నోడల్ ఆఫీసర్ డాక్టర్ డి.హనుమ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు డెంగీ, మలేరియా, డయేరియా వంటి వ్యాధులు, సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అదేవిధంగా బీసీజీ వ్యాక్సిన్ పై గ్రామస్తులకు అవగాహన కలిగించారు. గ్రామస్తులందరూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ జగన్ నరసింహారెడ్డి, హెల్త్ సూపర్ వైజర్ రామయ్య, ఏఎన్ఎం కిరణ్, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన అవసరం

వితంతువుల హక్కులపై అవగాహన సదస్సులో న్యాయమూర్తి కె.నరేంద్రరెడ్డి



చిలకలూరిపేట: సమాజంలో ప్రతి ఒక్కరికీ హక్కులు ఉంటాయని అలాగే వారి హక్కులపై వితంతువులు అవగాహన కలిగి ఉండాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.నరేంద్రరెడ్డి చెప్పారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిల్ హాలులో వితంతు పింఛన్ పథకానికి సంబంధించి న్యాయవిజ్ఞాన సదస్సు గురువారం నిర్వహించారు. వితంతువుల హక్కుల గురించి, భరణం ఎలా పొందాలి అనే విషయాలపై న్యాయమూర్తి అవగాహన కల్పించారు. మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, ఎంపీడీఓ కె.శ్రీనివాసరావులు వితంతవులు పింఛన్ పథకంలో ఎలా నమోదు చేసుకోవాలో వివరించారు. న్యాయవాదులు ఆనందరావు, జీవీహెచ్ఎస్ ప్రసాద్, మాదాసు భానుప్రసాద్, రామాంజనేయులు పాల్గొని ఉచిత న్యాయ సహాయం ఎలా పొందాలో వివరించారు.

ప్రశాంతంగా పేరెంట్స్ కమిటీ ఎన్నికలు

శావల్యాపురం: స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు ఎంఈఓ మద్దికుంట సాంబశివరావు గురువారం తెలిపారు. ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మండలంలోని 39 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా ప్రభుత్వ నిబంధనలు మేరకు ఆయా పాఠశాలల పరిధిలో ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో ఎన్నికలు జరిగాయని కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎంపిక జరిగినట్లు తెలిపారు. శావల్యాపురం జడ్పీ ఉన్నత పాఠశాల చైర్మన్‌గా పాటిబండ్ల శ్రావణికుమార్, వైస్ చైర్మన్‌గా సిద్దారపు సైదాబి, పోట్లూరు గ్రామం జడ్పీహెచ్ఎస్‌కి చింతా సైదా రామారావు-తమ్మిశెట్టి శారద, వేల్పూరు జడ్పీహెచ్ఎస్ దన్నవరపు శ్రీనివాసరావు-బొల్లా అంజలిదేవి, మతుకుమల్లి జడ్పీహెచ్ఎస్ మలినేడు రామాంజమ్మ-నలబోతుల లక్ష్మి, కారుమంచి జడ్పీహెచ్ఎస్ తోగిటి రఘుబాబు-మండే సుజాతలను చైర్మన్, వైస్ చైర్మన్లుగా కమిటీ సభ్యులు ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు నూతన చైర్మన్లు, వైస్ చైర్మన్లకు ప్రభుత్వ నిబంధనలు తెలియజేసి, ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పూలమాలలు వేసి సత్కరించి అభినందనలు తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

నరసరావుపేటరూరల్: తన పొలాన్ని గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించుకున్నారంటూ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన గురువారం అల్లూరివారిపాలెంలో చోటుచేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాలమేరకు.. గ్రామానికి గొట్టిముక్కల సుజాతకు తన తల్లి ద్వారా ఎకరం పొలం సంక్రమించింది. దీనిని గ్రామానికి చెందిన బొడ్డపాటి హనుమంతరావు, అంజమ్మలు ఆక్రమించుకున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులను కలిసి పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంతో గురువారం నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు యతించింది. స్థానికులు గమనించి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు ఫిర్యాదును స్వీకరించి విచారణ చేపట్టారు.

స్టాప్ డయేరియాపై అవగాహన

వినుకొండ(నూజెండ్ల): స్టాప్ డయేరియాపై నూజెండ్ల మండలంలోని పువ్వాడ గ్రామ సచివాలయ పరిధిలోని కొత్తకొత్తపాలెం ఎంపీపీ పాఠశాలల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛభారత్ మండల రీసోర్స్ కో-ఆర్డినేటర్ కంచర్ల సుబ్బారామయ్య మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని, దోమలు వ్యాప్తి చెందకుండా చూసుకోవాలన్నారు. హెచ్ఎం శ్రీలేఖ, సీహెచ్ఓ మస్తాన్‌వలి, ఉపాధ్యాయుడు బాపూజీ, ఏఎన్ఎం జయ, ఆశ కార్యకర్త రత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు

మండలంలో 64 స్కూళ్లకు 63 స్కూళ్లకు కమిటీలు ఎన్నిక



గొరిజవోలు ఎంపీయూపీ స్కూలులో చైర్మన్ ఎన్నిక ప్రక్రియలో చేతులు ఎత్తి మద్దతు తెలుపుతున్న తల్లిదండ్రులు

నాదెండ్ల: మండలంలో 64 పాఠశాలలకు గాను 63 పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. నాదెండ్ల ఎస్‌డబ్ల్యూ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య లేకపోవటంతో ఇక్కడ ఎన్నిక జరగలేదు. ఒక్కో తరగతి నుంచి ముగ్గురు విద్యార్థుల తల్లిదండ్రులను ఎంపిక చేసి, అనంతరం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకున్నారు. సాయంత్రం మొదటి ఎస్ఎంసీ సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై చర్చించారు. గణపవరం కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చైర్మన్‌గా కె.సుబ్బారావు, వైస్ చైర్మన్‌గా జి.శారద, సాతులూరు హైస్కూలు మేడ సుబ్బారావు, డి.శ్రీలక్ష్మి, సంకురాత్రిపాడు హైస్కూలు కె.విజయపార్థు, సలీమా, చిరుమామిళ్ల నడికట్టురామిరెడ్డి జెడ్పీ హైస్కూలు డీనాకుమారి, శామ్యూల్, చిరుమామిళ్ళ ఏపీ మోడల్ పాఠశాల ఎస్.జానకి, పి.పావని, తూబాడు జె.రత్నరాజు, షేక్ ఫిర్దోస్, కనపర్రు ఎస్.శ్రీనివాసరావు, నాగమణి, అమీన్‌సాహెబ్‌పాలెం కె.సురేష్, సీహెచ్ రమణ, నాదెండ్ల సలిశం ప్రియాంక, భాస్కరరావు ఎంపికయ్యారు.

బొల్లాపల్లిలో రసాభాసగా..

బొల్లాపల్లి: మండలంలో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు గురువారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో అధికార పార్టీ ఆధిపత్య ధోరణితో వ్యవహరించడంతో రాజకీయాలు చోటు చేసుకున్నాయని ప్రతిపక్షపార్టీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 79 ఉన్నాయి. వీటిల్లో కొన్ని పాఠశాలల్లో ఎన్నిక వాయిదా వేయడం జరిగింది. మిగిలిన పాఠశాలల్లో జరిగిన ఎన్నికలు అధికార పార్టీ ఆధిపత్య ధోరణి అవలంభించిందని ప్రతిపక్షపార్టీకి చెందిన వారు వాపోతున్నారు. వివిధ కారణాలతో గుమ్మనంపాడు, అయ్యన్నపాలెం, చెంచుకుంట తండా, దోమలగుండం ప్రాథమిక పాఠశాలల్లో, రేమిడిచర్ల హైస్కూల్లో పేరంట్స్ కమిటీ ఎన్నికలు వాయిదా వేయడం జరిగిందని ఎంఈఓ సయ్యద్ జఫ్రుల్లా తెలిపారు. అయ్యన్నంపాలెంలో పాఠశాల హెచ్ఎం అధికార పార్టీ వైపు వకల్తా పుచ్చుకొని వారి గెలుపునకు ప్రయత్నం చేయడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన తెలపడంతో ఎన్నిక వాయిదా పడింది. రేమిడిచర్ల హైస్కూల్లో అధికార పార్టీ నేతలు రంగ ప్రవేశం చేసి రసాభాస చేయడంతో ఎన్నిక వాయిదా వేశారు. ఎస్ఎంసీ ఎన్నికలు వాయిదా వేసిన పాఠశాలల్లో తిరిగి మళ్లీ నిర్వహించే తేదీని త్వరలో వెల్లడిస్తామని ఎంఈఓ తెలిపారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల: మండలంలోని 56 ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం నిర్వహించిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని 56 పాఠశాలల నుంచి 755 మంది మెంబర్స్‌ను ఎన్నుకున్నారు. వారి నుండి చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎంపిక చేశారు. దీంతో పాటు ఎక్స్అఫిషియో మెంబర్‌లు ఆరుగురిని, కోఆప్టెడ్ మెంబర్‌లుగా ఇరువురిని ప్రతి పాఠశాలలో నియమించారు. జిల్లా పరిషత్ హైస్కూల్ గోగులపాడుకు చైర్మన్‌గా నంబుల కవిత, వైస్ చైర్మన్‌గా బందేల చిన జేమ్స్, జెడ్పీహెచ్ఎస్ రొంపిచర్ల ఇట్టే ఏడుకొండలు, కొప్పు ఝాన్సీ, జెడ్పీహెచ్ స్కూల్ వి.రెడ్డిపాలెం వనిపంట వేమారెడ్డి, బోదాల ఏసమ్మ, ఏపీ మోడల్ స్కూల్ వి.రెడ్డిపాలెం వనిపంట రామిరెడ్డి, పాలేటి సువార్త, కేజీబీవీ సంతగుడిపాడు ఎస్.నాగమణి, యు. శ్రీను, బుచ్చిబాపన్నపాలెం జడ్పీ పాఠశాల ఆర్.సత్యనారాయణ చార్యులు, డి.తిరుపతమ్మ, జెడ్పీహెచ్ఎస్ కొత్తపల్లి చైర్మన్‌గా ఎల్.రాజేష్, వైస్ చైర్‌పర్సన్‌గా జి.లక్ష్మిలను ఎన్నుకున్నారు.

దాట్లవారిపాలెం ఎస్ఎంసీ చైర్మన్‌గా గడ్డం సంసోన్

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలం దాట్లవారిపాలెం ఎస్సీ కాలనీ ఎంపీపీ పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్‌గా గడ్డం సంసోన్‌ను, వైస్ చైర్మన్‌గా పసుపుల రాములమ్మను ఎన్నుకున్నట్లు హెచ్ఎం వి.వి.సూర్యనారాయణ తెలిపారు. నూతనంగా ఎన్నికైన సభ్యులను పలువురు అభినందించారు.

ఉపాధి హామీ పనులపై ముగిసిన ప్రజావేదిక

- 634 పనులకు గాను రూ.8,82,70,206లు ఖర్చు
- అవకతవకలు జరిగాయంటూ నివేదికలు

నాదెండ్ల: మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనుల సామాజిక తనిఖీపై ప్రజావేదిక నిర్వహించారు. ఎంపీపీ తలతోటి రాణి అధ్యక్షతన జరిగిన ప్రజావేదికకు ముఖ్యఅతిథిగా డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, ఏపీడీ సుధాకర్, విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి, ఎంపీడీఓ జాకీర్‌హుస్సేన్ హాజరయ్యారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31వరకూ మండలంలో 634 పనులకు గాను రూ.8,82,70,206లు ఖర్చు చేశారు. దీనిలో 588 పనులకు గాను వేతనాల రూపంలో రూ.6,22,61,707లు, మెటీరియల్ రూపంలో రూ.16,08,754లు ఖర్చు చేశారు. పంచాయతీరాజ్ శాఖలో 41 పనులకు గాను వేతనాల రూపంలో రూ.4,619లు, మెటీరియల్ రూపంలో రూ.2,22,46,895లు, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలో 5 పనులకు గాను మెటీరియల్ రూపంలో రూ.21,48,231లు ఖర్చు చేశారు. అయితే కొన్ని గ్రామాల్లో భారీగా అవకతవకలు జరిగినట్లు డీఆర్‌పీలు నివేదికలు అందించారు. అయితే తుది నివేదిక అందాల్సి ఉంది. ఏపీవో పుష్పరాజు, ఏపీఎం భరత్, టీఏ రాజు, ఎస్ఆర్‌పీ ఎం లోకేష్, డీఆర్‌పీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గణపవరం గ్రామానికి తీరని అన్యాయం...

గడిచిన నాలుగేళ్లలో గ్రామీణ ఉపాధి హామీ పథకంలో గణపవరం గ్రామానికి తీవ్ర అన్యాయం జరిగిందని మాజీ సర్పంచ్ వలేటి హిమంతరావు ప్రజావేదిక సభలో అధికారుల దృష్టికి తెచ్చారు. 2020 మార్చిలో పంచాయతీని రద్దు చేస్తూ మున్సిపాలిటీలో ప్రభుత్వం విలీనం చేసిందని, అయితే స్థానికులు హైకోర్టును ఆశ్రయించటంతో పంచాయతీ రాజ్ శాఖలోనే పాలన జరుగుతోందన్నారు. అయినప్పటికీ ఉపాధి హామీ పనులు మాత్రం వర్తింపచేయలేదని పీడీ జోసఫ్‌కుమార్‌కు వివరించారు. పనులు జరగనీయకుండా చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై పీడీ జోసఫ్‌కుమార్ స్పందిస్తూ ఎంపీడీఓ జాకీర్‌హుస్సేన్‌కు నివేదిక పంపాలని ఆదేశించారు. ఎంపీడీఓ జాకీర్‌హుస్సేన్ మాట్లాడుతూ, విలీన ప్రక్రియ హైకోర్టు పరిధిలో ఉన్నప్పటికీ కూలీల జాబ్‌కార్డులు రద్దు చేశారని తెలిపారు. పంచాయతీ తీర్మానం తీసుకుని త్వరలో గణపవరంలో కూలీలకు జాబ్‌కార్డులు మంజూరు చేసి పనులు జరిగేలా చూస్తామన్నారు.

ప్రతి ఇంటికి సురక్షిత నీరు

జేఎల్‌జీ జిల్లా కో-ఆర్డినేటర్ రంగారావు



జలజీవన్ మిషన్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

యడ్లపాడు: సురక్షితమైన తాగునీటిని అందించడంతో నూతన పథకాలను అందుబాటులోకి తీసుకురావడమే జలజీవన్ మిషన్ ప్రధాన లక్ష్యమని మిషన్ పల్నాడు జిల్లా కో-ఆర్డినేటర్ రంగారావు చెప్పారు. మండలంలోని కొత్తపాలెం గ్రామంలో గ్రామీణ నీటి పారుదల, పారిశుధ్యం, స్వచ్ఛభారత్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం గ్రామసభను ఏర్పాటు చేశారు. జలజీవన్ పథకం అవగాహన కోసం నిర్వహించిన ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ మిషన్‌ద్వారా గ్రామంలోని ఇంటింటికి కుళాయిల ద్వారా సురక్షిత నీరు 55 లీటర్లు అందించడం ప్రధాన ఉద్దేశం అన్నారు. గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలలకు ఉచితంగా సురక్షిత నీటిని అందించడం జరుగుతుందన్నారు. స్వచ్ఛభారత్ ప్రతినిధి సత్యప్రసాద్ మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులబారిన పడకుండా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను గ్రామీణులు పాటించారు. ప్రజలు నీటిగుంతల్ని తమ ఇంటి ప్రదేశాల్లో నిర్మించి వర్షపు నీటిని వృధాకాకుండా చూడాలన్నారు. పంచాయతీ ఉపసర్పంచ్ మానం సాంబయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు, కార్యదర్శి అఖిల్, స్వచ్ఛందసంస్థ ప్రతినిధి నళిని, వార్డు సభ్యులు, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

పల్నాడు ఎక్స్‌ప్రెస్‌కు పెదకూరపాడులో హాల్ట్ కల్పించాలి



సంతకాలు సేకరిస్తున్న శరత్‌చంద్ర, ప్రజాసంఘాల నాయకులు

పెదకూరపాడు: పెదకూరపాడు రైల్వే స్టేషన్‌లో రేపల్లె-సికింద్రాబాద్ పాసింజర్‌తోపాటు పల్నాడు ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్ కల్పిస్తే రాజధాని ప్రాంత ప్రయాణికులకు ఉపయోగం ఉంటుందని కోరుతూ ఇంటింట సంతకాలు సేకరించే కార్యక్రమాన్ని ప్రముఖ జర్నలిస్టు, అభ్యుదయ రచయితల సంఘం నాయకురాలు కొమ్మాలపాటి శరత్‌చంద్ర జ్యోతిశ్రీ ప్రారంభించారు. గురువారం నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో పార్టీలకతీతంగా పల్నాడు ఎక్స్‌ప్రెస్, రేపల్లె ప్యాసింజర్ పెదకూరపాడులో హాల్ట్ కోరుతూ సంతకాల సేకరణ ఉద్యమం చేపట్టారు. జిల్లా రైతు సంఘ నాయకులు శేషారావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు గుంటూరు మల్లేశ్వరి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సయ్యద్‌అక్బర్‌ల ఆధ్వర్యంలో సంతకాల సేకరణ నిర్వహించారు. ఉద్యోగులు, వ్యాపారులు, ప్రజల నుంచి పెద్ద ఎత్తున డిమాండ్ ఉంది. వివిధ పనుల నిమిత్తం నిత్యం వందల సంఖ్యలో పెదకూరపాడు నుంచి హైదరాబాద్ వెళుతుంటారని దీన్ని దృష్టిలో పెట్టుకుని రైళ్ల హాల్ట్‌ను కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ వరి విత్తనాలు సాగుచేసుకోవాలి

ఏడీఏ మస్తానమ్మ

నరసరావుపేట రూరల్: జేజీఎల్-384 రకం విత్తనాల కోసం ఎదురుచూడకుండా అందుబాటులో ఉన్న చీడపీడలను తట్టుకునే ప్రత్యామ్నాయ రకాలను రైతులు సాగుచేసుకోవాలని ఏడీఏ పి.మస్తానమ్మ తెలిపారు. సబ్‌డివిజన్ పరిధిలో నరసరావుపేట, రొంపిచర్ల మండలాల్లో 5వేల హెక్టార్ల సాధారణ విస్తీర్ణంలో వరి సాగు చేస్తారని అంచనాగా ఉన్నట్టు తెలిపారు. ఇందుకు దాదాపు 3,750 క్వింటాళ్ల విత్తనాలు అవసరం కాగా ఇప్పటి వరకు పట్టణంలోని దుకాణాల ద్వారా దాదాపు 5వేల క్వింటాళ్ల వరకు విత్తన విక్రయం జరిగిందన్నారు. జేజీఎల్ 384 రకం విత్తనాల కోసం ఇతర డివిజన్‌లోని రైతులు రావడం వలన దుకాణాల వద్ద భారీ క్యూలైన్‌లు ఏర్పడినట్టు తెలిపారు. జేజీఎల్383 రకానికి ప్రత్యామ్నాయంగా స్వల్పకాలిక రకాలైన ఎంటీయూ 1224, ఎంటీయూ 1282, కేఎన్ఎం 733, కేఎన్ఎమ్ 1638, ఎన్ఎల్ఆర్ 15048 వరి విత్తనాలను సాగుచేయాలని సూచించారు. 120 నుంచి 130 రోజుల కాలపరిమితిలో చీడపీడలను ఈ రకాలు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయని వివరించారు.

శావల్యాపురం: ఖరీఫ్ సీజనులో వరి విత్తనాల కోసం ఆందోళన పడాల్సిన పనిలేదని మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు అన్నారు. గురువారం స్థానిక రైతుభరోసా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో వరి నారుమడుల సాగుకు అన్నదాతలు సన్నద్ధం అవుతున్నారన్నారు. ఈక్రమంలో వరి విత్తనాలు అన్నీ రైతుభరోసా కేంద్రాల్లో రాయితీపై ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. ప్రస్తుతానికి ప్రభుత్వ పరంగా ఏంటీయూ 1224 వరి వంగడాలు, కె.ఎన్.యం. 1638, ఎన్.ఎల్.ఆర్ 3449 రకం వరి విత్తనాలను ప్రభుత్వం అన్నీ రైతుభరోసా కేంద్రాలకు సరఫరా చేస్తుందన్నారు.

సబ్సిడీపై వరి విత్తనాలు

ఈపూరు: మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో వరి విత్తనాలను సబ్సిడీపై అందజేస్తున్నట్లు ఏఓ రామారావు గురువారం తెలిపారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలిజేసినట్లు జేజీఎల్ రకానికి బదులు సమానమైన ఎంటీయూ-1224, కేఎన్ఎం 1638 రకాల విత్తనాలను కూడా వినియోగించుకోవచ్చని రైతులకు తెలిపారు. సేవా కేంద్రాల్లో కేజీకి రూ.5ల చొప్పున సబ్సిడీపై బీపీటీ - 5204, ఎంటీయూ -1224, కేఎన్ఎం -1638, ఎన్ఆల్ఆర్ - 34449, ఎంటీయూ 1121 విత్తనాలను అందిస్తున్నట్లు తెలిపారు.

రొంపిచర్ల: పల్నాడులో జేజీఎల్-384 రకం వరిపంటను వేయడానికి అలవాటు పడ్డారని ఆ రకం వరి విత్తనాలు అందుబాటులో లేనందున ప్రత్యామ్నాయ వంగడాలను సాగు చేయాలని జిల్లా వ్యవసాయ శిక్షణా కేంద్రం ఉపసంచాలకులు శివకుమారి అన్నారు. మండలంలోని విప్పర్ల, రెడ్డిపాలెం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నరసరావుపేట వ్యవసాయ సహాయ సంచాలకులు పి.మస్తానమ్మ, గ్రామ వ్యవసాయ సహాయకులు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, కోటమ్మ, పలువురు రైతులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో బైక్‌ల చోరీ నిందితులు

నరసరావుపేట టౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు చోరీకి పాల్పడుతున్న ఇద్దరిని వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు ఇటీవల కాలంలో ఎక్కువగా అపహరణకు గురయ్యాయి. వాహన యజమానుల ఫిర్యాదుతో వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి సంఘటనా స్థలం సమీపంలో లభ్యమైన సీసీ పుటేజీలను పరిశీలించి నిందితులను గుర్తించారు. మండలంలోని గురవాయపాలెం గ్రామానికి చెందిన ఇద్దరు ద్విచక్ర వాహనాలు చోరీకి పాల్పడుతున్నట్లు ప్రాథమికంగా నిర్ధారించుకున్నారు. దీంతో బుధవారం రాత్రి ఇద్దరిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి సుమారు 5 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నరసరావుపేటతో పాటు పలు ప్రాంతాల్లో ద్విచక్రవాహనాలు చోరీలు చేసినట్లు నిందితులు నేరాన్ని అంగీకరించి దొంగిలించిన వాహనాలను పోలీసులకు అప్పగించినట్లు సమాచారం.

విక్టరీ కళాశాలలో రక్తదాన శిబిరం



నరసరావుపేట రూరల్: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం విక్టరీ డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరాలు నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా శాఖ చైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహనరెడ్డి, సీజీఎస్‌టీ సూపరింటెండెంట్ రామ్మోహనరెడ్డి, రోటరీ క్లబ్ అధ్యక్షుడు కపలవాయి రాజేంద్రప్రసాద్, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ యం.సుమిత్రకుమార్, రాయల శ్రీనివాసరావు, కళాశాల కార్యదర్శి ఒద్దుల సుబ్బారెడ్డి, డైరెక్టర్ మైనీడి శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ పి.వేణుగోపాల్ పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థికసాయం

నరసరావుపేట: కేరళ వరది బాధితుల కోసం డివిజన్ సభ్యుల సహకారంతో సేకరించిన రూ.26,850లను ఏపీ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ఆర్ఎంపీ, పీఎంపీలు కేరళ రాష్ట్ర ప్రభుత్వానికి నెఫ్ట్ ద్వారా గురువారం పంపించారు. ఈ విషయాన్ని కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు కలిసి ఆయన దృష్టికి తీసుకెళ్లారు. డివిజన్ అధ్యక్షులు షేక్ బాజీ, కార్యదర్శి సైదా, డివిజన్ కమ్యూనికేటర్ ఆరేటి నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు ఎస్.వీరాంజనేయులు, సభ్యులు మస్తాన్‌వలి, దాదాసాహెబ్ పాల్గొన్నారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి



యడ్లపాడు రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వీఆర్ఏలు

యడ్లపాడు: తెలంగాణ రాష్ట్రం తరహాలో తమకు పేస్కేల్‌ను అమలు చేయాలని పల్నాడు జిల్లా వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు షేక్ బందగీ సాహెబ్ పేర్కొన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ గురువారం యడ్లపాడు మండల, గ్రామ రెవెన్యూ సహాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ నరసరావుపేట డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న అటెండర్, నైట్ వాచ్‌మెన్ పోస్టుల్ని వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అర్హత ఉన్న వీఆర్ఏలకు వీఆర్వోలుగా పదోన్నతి కల్పించాలని కోరారు. ప్రస్తుతం నామినీలుగా పని చేస్తున్న వారిని వీఆర్ఏలుగా గుర్తించాలన్నారు. నైట్‌వాచ్‌మెన్ డ్యూటీలను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం తమ సమస్యలతో కూడిన వినతిని తహసీల్దార్ జెట్టి విజయశ్రీకి అందించారు. కార్యక్రమంలో యడ్లపాడు మండల గ్రామరెవెన్యూ సహాయకుల సంఘం అధ్యక్షులు కోటేశ్వరమ్మ, రాజేష్, నసీమా, రాజారత్నం, నరసింహారావు, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

పౌరసేవల అమలులో నిర్లక్ష్యం వద్దు

తహసీల్దార్ జి.విజయశ్రీ

యడ్లపాడు: గ్రామీణ ప్రాంత ప్రజలకు వేగవంతమైన..నాణ్యమైన పౌరసేవల్ని అందించే లక్ష్యంతోనే మీ సేవా కేంద్రాల నిర్వాహకులు పనిచేయాలని తహసీల్దార్ జెట్టి విజయశ్రీ చెప్పారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గురువారం మండలం పరిధిలోని మీ సేవా కేంద్రాల నిర్వాహకులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మీ సేవా కేంద్రాల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యల్ని తెలుసుకున్నారు. అనంతరం పౌరసేవల లక్ష్యాలు, అమలుపై మీ సేవా నిర్వాహకులకు దిశానిర్దేశం చేశారు. దరఖాస్తు సమయంలోనే అవసరమైన అన్ని పత్రాలను అర్జీదారుని నుంచి సేకరించాలని సూచించారు. అదేవిధంగా అధికారుల్ని సమన్వయం చేసుకుని నిర్దేశించిన గడువులోగా పౌరసేవల్ని ప్రజలకు అందించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో గొర్రెల కాపరి మృతి

సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో గొర్రెల కాపరి మృతి చెందిన ఘటన పట్టణంలోని అమరావతి మేజర్ కాలువ సమీపంలో బుధవారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామానికి చెందిన గొర్రెల కాపరి బండారు నరేంద్ర (29) మాంసం కోసి పట్టణంలోని రెస్టారెంట్లకు అందిస్తుంటాడు. ఈ క్రమంలో పొట్టేలు తోలు విక్రయించేందుకు స్నేహితుడు అప్పాపురం భూపతితో కలిసి సత్తెనపల్లి వచ్చి తిరిగి ద్విచక్ర వాహనంపై ఇరువురు వెళుతుండగా అమరావతి మేజర్ కాలువ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వారు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికంగా ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలిస్తుండగా మార్గమధ్యంలో బండారు నరేంద్ర మృతి చెందాడు. స్నేహితుడు భూపతికి తీవ్ర గాయాలు కావడంతో గుంటూరులో చికిత్స పొందుతున్నాడు. మృతుడికి భార్య రాజేశ్వరి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. అభం శుభం తెలియని ఆడపిల్లలతో ఎలా జీవించాలి, తమకు దిక్కెవరు దేవుడా అంటూ రాజేశ్వరి రోదిస్తున్న తీరు పలువురిని కంటతడికి గురి చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వర్షంనీరు తొలగింపు



గుంటూరు రోడ్డులో పొక్లెయిన్‌తో నీరు పోయే మార్గం చేస్తున్న దృశ్యం

నరసరావుపేట: గుంటూరు రోడ్డు స్వర్గపురి ఎదురుగా జమ్ము, పిచ్చి చెట్ల కారణంగా నీరు నిల్చిన మురుగు కాలువను మున్సిపల్ అధికారులు గురువారం శుభ్రం చేశారు. మున్సిపల్ కమిషనర్ సి.రామచంద్రారెడ్డి స్వయంగా దగ్గర ఉండి పొక్లెయిన్ సహాయంతో మురుగు ప్రవాహానికి అడ్డుపడిన సిల్టు, మొక్కలను తొలగింపజేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు నిండి పోయే మార్గంలేక రోడ్డుపైకి వస్తుండటంతో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకున్నారు. పారిశుద్ధ్య కాంట్రాక్టర్ క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి

పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభుదాసు



మాట్లాడుతున్న పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభుదాసు

సత్తెనపల్లి: ప్రభుత్వంతో చర్చించి పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని ఏపీ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ప్రభుదాసు అన్నారు. పట్టణంలోని పెన్షనర్స్ అసోసియేషన్ హాల్లో గురువారం పల్నాడు జిల్లా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం సత్తెనపల్లి శాఖ అధ్యక్షుడు బొడ్డు రామారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రభుదాసు మాట్లాడుతూ పెన్షనర్లకు సంబంధించిన అన్ని సమస్యల పరిష్కారానికి ఐకమత్యంగా ఉండి కృషి చేద్దామన్నారు. డీఏ, పీఆర్సీ ఎరియర్స్, ఈహెచ్ఎస్, నామినీ తదితర వాటిపై చర్చించారు. జిల్లా కార్యవర్గ సమావేశాలను కేవలం జిల్లా కేంద్రాలకే పరిమితం కాకుండా జిల్లా పరిధిలోని వేర్వేరు మండలాల్లో నిర్వహించడం అభినందనీయమని, అలా చేయడం వలన ఆయా శాఖల మధ్య సమన్వయం పెరుగుతుందన్నారు. పల్నాడు జిల్లా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మానవ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి ఆదియ్యలు మాట్లాడారు. ఈ సందర్భంగా 8 మండల శాఖలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు పలు సమస్యలపై చర్చించారు. కళాకారులైన కొత్తూరు రామకోటయ్య, రమాదేవి, సత్తెనపల్లి నాసరయ్య, ఔత్సాహిక కళాకారులైన లక్ష్మయ్య, బెజ్జగం రవికుమార్‌లు కళా ప్రదర్శనలు ఇచ్చారు. అనంతరం కళాకారులను సత్కరించారు. సమావేశంలో పెన్షనర్స్ అసోసియేషన్ బాధ్యులు జక్కుల లక్ష్మీనారాయణ,కేబీఆర్‌జే ప్రసాద్, రంగారెడ్డి, పెన్షనర్లు తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో బహుళ ప్రయోజనాలు

నకరికల్లు: సకాలంలో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం.శివకుమారి అన్నారు. మండలంలోని చీమలమర్రి గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో పొలంబడి కార్యక్రమంలో యాజమాన్య పద్ధతులపై గురువారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జేజీఎల్ 384 వరి రకానికి ప్రత్యామ్నాయంగా ఎంటీయూ 1224, కేఎన్ఎం 1638 రకం వరి రకాలు సాగు చేసుకోవచ్చని సూచించారు. విత్తనాల కొనుగోలులో కేజీకి రూ.5 చొప్పున ప్రభుత్వం రైతులకు రాయితీ కల్పిస్తుందని అన్నారు. నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మ, ఏవో కె.దేవదాసు తదితరులు పాల్గొన్నారు.